

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్


8 పేజీలు | సోమవారం | అక్టోబర్ 30, 2023 | www.navatelangana.com



దండారి.. ఉత్సవాలకు వేళాయే..

- ఆదివాసీ, గోండుల పవిత్ర పండగ
- సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబం
- ప్రారంభం కానున్న దండారి సంబరాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన గిరిజనులు

4లో...



పార్టీలు కాదు... అభ్యర్థులే ప్రధానం

- సిర్పూర్ నియోజకవర్గంలో ఓటర్ల విభిన్న తీర్పు
- అభ్యర్థుల వ్యక్తిగత గుణాగణాలపైనే ఆధారం
- ప్రత్యేకత చాటుకుంటున్న ప్రజలు

2లో...

- ఆదిలాబాద్ జిల్లాలో లక్షకు పైగా ఓట్లు వారివే
- అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం
- మచ్చిక చేసుకునేందుకు అన్ని పార్టీల ప్రయత్నం

యువత చూపు..ఎటువైపు..?

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభం కావడంతో ఆయా పార్టీల దృష్టంతా ఓట్ల వేటపై పడుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి పార్టీల్లో చేరికలపైనే దృష్టి సారిస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో యువతతో పాటు మహిళల ఓట్లు కీలకంగా మారనున్నాయి. వీరికి తమవైపు ఆకర్షించేందుకు ఆయా రాజకీయ పార్టీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. వివిధ రకాల తాయిళాలు ప్రకటిస్తూ మచ్చిక చేసుకొనే ప్రయత్నాలు ప్రారంభించాయి. ముఖ్యంగా యువకులను దగ్గర చేసుకునేందుకు ఆయా పార్టీలు యువతకు అవసరమైన క్రీడా పరికరాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. రాజకీయ పార్టీలు సైతం యువతను ఆకర్షించేందుకు వివిధ రకాల పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

జిల్లాలో 4,42,430మంది ఓటర్లు

ఆదిలాబాద్ జిల్లాలో బోథ్, ఆదిలాబాద్ రెండు నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో 4,42,430మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,40,284మంది యువ ఓటర్లు ఉన్నారు. 10వేల మందికి పైగా యువకులు కొత్తగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 1.24లక్షల మంది యువ ఓటర్లు ఉండగా బోథ్ నియోజకవర్గంలో 1.15లక్షల మంది యువ ఓటర్లు ఉన్నారు. మొత్తంగా 30నుంచి 39ఏండ్ల మధ్య ఉన్న యువ ఓటర్లు అత్యధిక మంది ఉన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ఏకంగా 1,26,757మంది ఓటర్లు ఉన్నారు. మిగితా వయసుల వారి కంటే వీరి ఓట్లే అధికంగా ఉండటంతో రాజకీయ పార్టీలన్నీ వీరి ఓట్లపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయని తెలుస్తోంది.





రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం యువత చేతిలోనే ఉంది. కేంద్రం ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో యువ ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే రెండు నియోజకవర్గాల్లో లక్షకు పైగా ఓటర్లు ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే ఓటు బ్యాంకు కలిగి ఉండటంతో వివిధ రాజకీయ పార్టీలు వీరికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రస్తుతం ఆయా ప్రధాన పార్టీలన్నీ యువత చేరికలపైనే అధిక దృష్టి సారిస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో వార్డుల వారీగా వందల మంది యువత రోజువారీగా వివిధ పార్టీల కండువాలు కప్పుకుంటున్నారు. వివిధ రకాల తాయిళాలు ప్రకటిస్తూ మచ్చిక చేసుకునే ప్రయత్నం చేయడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

వయసుల వారీగా ఓటర్ల వివరాలు

వయసు	ఆదిలాబాద్	బోథ్
18-19	7293	4328
20-29	52928	48978
30-39	64,637	62,120
40-49	46579	30665
50-59	33147	26129
60-69	18923	15928
70-79	9870	7226
80-89	2088	1959
90-99	269	343
100-109	14	11
110-119	00	00

ఏసీబీ వలలో మామడ ఎస్సై

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ జిల్లా మామడ ఎస్సై కే.రాజు రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఆదివారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన సల్కం సతీష్, సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు అక్టోబర్ 24న అదే గ్రామానికి చెందిన సుప్పరి నరేష్ అనే వ్యక్తితో గొడవ పడ్డారు. అనంతరం సుప్పరి నరేష్ ఫిర్యాదుతో మామడ ఎస్సై రాజు 323, 341, 291 సెక్షన్ల కింద కేసు పెట్టారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాలని ఎస్సైని సల్కం సతీష్, అతని సోదరులు కోరగా, రూ.10వేలు లంచం ఇవ్వకుంటే రిమాండ్ చేస్తానంటూ బెదిరించారు. ఎస్సైకి రూ.10 వేలు ఇవ్వడానికి బేరం కుదుర్చుకున్నారు. ఇదే విషయం గురించి సల్కం సతీష్, అతని సోదరులు సల్కం తిరుమల్ ఏసీబీని సంప్రదించి ఫిర్యాదు చేశారు. ఆదివారం సల్కం తిరుమల్ ఎస్సైకి రూ.10 వేలు లంచం ఇచ్చే క్రమంలో ఏసీబీ అధికారులు వలపన్ని చాకచక్యంగా పట్టుకున్నారు.





తనిఖీలు చేస్తున్న అధికారులు

గిరిజన విద్యార్థి మృతికి కారకులైనవారిని పట్టుకుంటాం

- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థినీ అనుమానాస్పద మృతిపై ఉట్నూర్ డీఎస్పీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారించి నిందితులను పట్టుకుంటామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని దొంగచింత పంచాయతీ పరిధిలోని భీంజీగూడకు చెందిన ఆదివాసీ విద్యార్థినీ(17) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఉట్నూర్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మృతురాలి కుటుంబ సభ్యులతో నిందులను త్వరలో పట్టుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ అనుమానాస్పదంగా మృతి చెందిన గిరిజన విద్యార్థినీ స్థానిక ఓ కళాశాలలో ఇంటర్ చదువుకుంటుందని, దసరా పండగ సందర్భంగా ఇంటికి వచ్చిందన్నారు. తల్లిదండ్రులు గ్రామ సమీపంలో సాగు చేస్తున్న వ్యవసాయ పంటలను కాపాడుకునేందుకు కొన్ని రోజులుగా సెల్‌ఫోన్ పెట్టుకొనే వెళ్లుతుంది. శనివారం కూడా పంటలకు కాపలాగా వెళ్ళిందని, తల్లిదండ్రులు స్థానికంగా జరిగిన సభకు వచ్చి ఇంటికి సాయంత్రం వరకు వెళ్లారు. కూతురు రాత్రి వరకు ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే స్వచ్ఆఫ్ వచ్చిందని ఫిర్యాదులో తెలిపారన్నారు. చెనుతో పాటుగా చుట్టుపక్కల గాలించాగా ఎలాంటి ఆచూకి లభించలేదన్నారు. చెట్ల పొదల్లో ఆమె శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారని, ఘటన స్థలాన్ని పరిశీలినలో ఆమె మొకంపై బాండ రాయితో బాది చంపినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేశారని, హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థిని మృతదేహం ఆస్పత్రిలో ఉన్న విషయం తెలుసుకున్న రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపురావు, పెందూర్ ప్రభాకర్ అక్కడికి చేరుకున్నారు. హత్య చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

c m y k

రాజకీయ పార్టీలు సహకారం అందించాలి : ఆర్డీఓ స్రవంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా రాజకీయ పార్టీల పతినిధులు తమ సహకారం అందించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ స్రవంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా సహకరించాలన్నారు. ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని, దేవాలయాలు, చార్చీలు, మసీదులు, ఇతర ప్రార్థన ప్రదేశాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని, నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వాటికీ, సభలు, సమావేశాలు, వాహన ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు.

నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా పోటీ చేసే అభ్యర్థుల నుండి స్వీకరించే నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కాడె హేమంత్ సహదేవరావు అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 3న నోటిఫికేషన్, 10 వరకు నామినేషన్ల స్వీకరణకు చివరి గడువని,13న పరిశీలన, 15న ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5 వరకు ఉంటాయన్నారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నామినేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఏవైనా తప్పులుంటే వెంటనే లిఖిత పూర్వకంగా సంబంధిత అభ్యర్థికి సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ, అధికారులు పాల్గొన్నారు.

గోదావరి నది వద్ద రూ.13 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-బాసర

గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం ముధోల్ సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసు బీఎస్ఎఫ్ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయగావ్ గ్రామానికి చెందిన బాలాజీ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 13 లక్షలు తీసుకువస్తున్నాడు. తనిఖీలో పోలీసులకు ఆధారాలు లభించకపోవడంతో రూ.13 లక్షలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా




సీఐ వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. రూ. 50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్లొద్దన్నారు.

పార్టీలు కాదు.. అభ్యర్థులే ప్రధానం







- సిర్పూర్ నియోజకవర్గంలో ఓటర్ల విభిన్న తీర్పు
- అభ్యర్థుల వ్యక్తిగత గుణాగణాలపైనే ఆధారం
- ప్రత్యేకత చాటుకుంటున్న ప్రజలు

ప్రతి ఐదేండ్లకోసారి రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతుంటాయి. ఆ మార్పులు నియోజకవర్గ రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. కాని సిర్పూర్(టి) నియోజకవర్గంలో మాత్రం రాష్ట రాజకీయాలు ఏ మాత్రం ప్రభావం చూపడం లేదు. ఈ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల గుణ, గణాలను బట్టే గెలుపు, ఓటములు ఖరారవుతున్నాయి. కొన్నేళ్ల ఫలితాలను చూస్తే ఇది అర్థమవుతోంది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలోనే నెం.1 నియోజకవర్గం సిర్పూర్(టి). ఈ నియోజకవర్గంలో కొన్నేళ్ల నుండి రాష్ట్ర రాజకీయాలకు విభిన్నంగా ఓటర్లు తీర్పు నిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలది ఒక దారైతే, ఈ నియోజకవర్గ రాజకీయాలు మరో దారిన వెళుతున్నాయి. 1989 నుండి ఇప్పటి వరకు ఓటర్లు విభిన్న తీర్పులు ఇస్తున్నారు. స్థానికంగా పోటీ చేసే అభ్యర్థులనే ఓటర్లు పరిగణలోనికి తీసుకుంటున్నారు. 1983, 1985లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి కేవీ నారాయణరావు గెలుపొందారు. ఈ రెండు సార్లు మాత్రమే రాష్ట్ర రాజకీయాలకు అనుగుణంగా ఇక్కడి ఓటర్లు తీర్పు ఇచ్చారు. సినీ హీరో ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీని ఇక్కడి ప్రజలు అప్పట్లో ఆదరించి, కేవీ నారాయణరావును గెలిపించారు. ఆ తర్వాత నుండి రాష్ట్ర రాజకీయాలను ఇక్కడి ప్రజలు పక్కన పెడుతూ వస్తున్నారు. 1989, 1994లో స్వతంత్ర అభ్యర్తిగా పోటీ చేసిన పాల్వాయి పురుషోత్తంరావు గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభంజనం కొనసాగుతోంది. అయినా ఇక్కడి ఓటర్లు స్వతంత్ర అభ్యర్థికి పట్టం కట్టారు. పురుషోత్తంరావు మరణానంతరం ఆయన సతీమణి పాల్వాయి రాజ్యలక్ష్మి టీడీపీ నుండి పోటీ చేసి సానుభూతి పవనాలతో విజయం సాధించారు. అనంతరం 2004లో కాంగ్రెస్ నుండి పోటీ చేసిన కోనేరు కోనప్ప విజయం సాధించారు. అప్పటికే కోనప్ప ఒకసారి పోటీ చేసి ఓడిపోవడంతో ఆయనకు ఓటర్లు పట్టం కట్టారు. తర్వాత 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తున్నా, ఇక్కడి ఓటర్లు మాత్రం టీఆర్ఎస్(బీఆర్ఎస్) అభ్యర్థి కావేటి సమ్మయ్యకు ఓట్లేసి గెలిపించారు. 2010 ఉప ఎన్నికలలో మళ్లీ కావేటి సమ్మయ్యనే గెలిపించారు. అప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఆ పార్టీ నుండి నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి సిర్పూరు నియోజకవర్గం నుండి పోటీ చేసినా ఓటర్లు ఆయనను కాదని, టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అభ్యర్థి కావేటి సమ్మయ్యనే గెలిపించారు. 2014లో రాష్ట్రం మొత్తంగా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పవనాలు వీస్తున్నా, ఆ పార్టీ అభ్యర్థి కావేటి సమ్మయ్యను కాదని బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీలో ఉన్న కోనేరు కోనప్పను గెలిపించారు. రాష్ట్రంలో బీఎస్పీ బలహీనంగా ఉన్నా, ఇక్కడ మాత్రం ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించారు. 2018లో టీఆర్ఎస్(బీఆర్ఎస్) అభ్యర్థి కోనేరు కోనప్పను గెలిపించారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి హరీష్‌బాబు కోనప్పకు గట్టి పోటీ ఇచ్చారు. ఎన్నికలకు మూడు నెలల ముందే రాజకీయాల్లోకి వచ్చిన హరీష్‌బాబు కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండడంతో రాష్ట్రం మొత్తం టీఆర్ఎస్ హవా వీస్తున్నా కాంగ్రెస్ అభ్యర్థి హరీష్‌బాబుకు సుమారు 59 వేల ఓట్లు వేసి ఓటర్లు విభిన్న తీర్పు ఇచ్చేలా కనిపించారు. చివరికి కోనప్ప విజయం సాధించారు.

ఈ సారి ఎన్నికల్లో కూడా...

ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఈ నియోజకవర్గ ఓటర్లు అభ్యర్థుల ఛరిష్మాకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశమున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నువ్వా నేనా అన్నట్లుగా పోటీలో ఉన్నాయి. కాని ఇక్కడ మాత్రం బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీలో ఉండి ఈ మూడు పార్టీలకు ధీటుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఓటర్లు కూడా ఆయనను ఆదరిస్తున్నారు. బీఆర్ఎస్ నుండి కోనేరు కోనప్ప, బీజేపీ నుండి పాల్వాయి హరీష్‌బాబులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుండి రావి శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. రాష్ట్ర రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ నాలుగు పార్టీల అభ్యర్థులను ఆదరిస్తున్న ఓటర్లు, ఏ అభ్యర్థి నాయకత్వాన్ని సమర్థిస్తూ ఓట్లేసి గెలిపిస్తారో వేచి చూడాల్సిందే.

ఆసిఫాబాద్‌లో సినీ టీవీ మీడియా సెంటర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురం భీం లాంటి వెనుకబడిన జిల్లా నుంచి కళాకారులను ప్రోత్సహించేందుకు ఆసిఫాబాద్‌లో సినీ, టీవీ మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రముఖ బుల్లితెర దర్శక నిర్మాత, నటుడు, సినీ రచయిత, తెలుగు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టీవీ, సినీ కళాకారుల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యువ దర్శకుడు మానస్‌తో కలిసి ఔత్సాహికులైన దర్శకులు, నటీనటులు, కళాకారులకు సినీ,టీవీ రంగాలపై అవగాహన కల్పించారు. నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సాహం ఉన్న కళాకారులు ఉన్నప్పటికీ వారికి సినీ, టీవీ రంగాల్లో ఎలా స్థిరపడాలో తెలియక కష్టనష్టాలకు గురవుతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక ప్రపంచంలో యూట్యూబ్ ఛానల్, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలింలు, వెబ్ సిరీస్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్థానిక కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిభ కనబరిచిన కళాకారులను సినీ టీవీ రంగాల్లో అవకాశం కల్పించేందుకు నవజ్యోతి సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవజ్యోతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సాయిని రాజశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షులు డి రామారావు, కోశాధికారి ముప్ప చంద్రశేఖర్, సంస్థ ప్రముఖులు వెంకటేశ్వర్లు రాధాకృష్ణ చారి, నల్లగొండ రమేష్, ఢిల్లీ విజయ్ కుమార్, పాల్గొన్నారు.

రూ.5.89 లక్షలు సీజ్



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో చెక్‌పోస్టు, టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల తనిఖీలో ఇద్దరు వ్యక్తుల నుండి రూ.5.89 లక్షలు పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి ఎఫ్ఎస్‌సీకు అప్పగించామన్నారు. చంద్రాపూర్ నుండి ఆసిఫాబాద్ వైపుకు వెళ్తున్న నగేష్ అగర్వాల్ వద్ద రూ.ఐదు లక్షలు, శరత్ వద్ద రూ.89 వేలు పట్టుకున్నాట్లు పేర్కొన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తరలిస్తే వాటికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
సోమవారం అక్టోబర్ 30, 2023

తనిఖీల్లో 11 లీటర్ల మద్యం పట్టివేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్(జి) పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో చాక్‌పెల్లి గ్రామంలోని అడ్డిగా భోజన్న ఇంట్లో దాచిన 11 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఎన్నికల సందర్భంగా సోదాలు నిర్వహించగా సదరు వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన మద్యం పట్టుకున్నామని, మద్యం విలువ రూ.5వేల 140 ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టడం గానీ, అత్యధిక సొమ్ము నిలువ ఉంచిన గాని కఠిన చర్యలకు బాధ్యులవుతారని ఎస్సై పేర్కొన్నారు.



బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- కార్యకర్తలకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దిశానిర్దేశం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు యాదవ సంఘం సభ్యులు మంత్రి ఐకేరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బదుగారి నరేష్, దొడ్డ ముత్యం, దొడ్డ గంగయ్య, శిలారీ శ్రీనివాస్‌తో పాటు 100 మంది యాదవ సంఘ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని అన్నారు. గ్రామంలో రూ.45లక్షలతో 3 దేవాలయాలను నిర్మించామని అన్నారు. కొంతమంది కులం, మతం పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని అన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి, కారు గుర్తుకే ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేశం రమేష్, మేకల రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

కారేగాం అన్ని రంగాల్లో అభివృద్ధి

నవతెలంగాణ-ముథోల్

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కారేగాం గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కారేగాంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటరులను కోరారు. ఎమ్మెల్యే గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. గ్రామంలో ప్రతి కాలనీకి సీసీ రోడ్లులు, మురికి కాలువలు నిర్మించారని అన్నారు. అలాగే గ్రామంలో రైతు వేదిక, నూతనంగా ఎల్లమ్మ మందిరం, రైతుల సౌకర్యార్థం గోదాములను నిర్మించారు. అలాగే అనేక అభివృద్ధి పనులను కూడా చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖలీద్, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, నాయకులు మురళి, బోయిడి అనిల్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు నిర్వాహణ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం పోలీసులు కేంద్ర బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై యాసిత్ అరాఫత్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. అందుకే ఎన్నికల సందర్భంగా ఎవరు యాభై వేలకు మించి ఇతర ప్రాంతాలకు తరలించారాదని, మద్యం తరలించినా పోలీసుల చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో కార్మికుల సమస్యలను చేర్చాలి

- సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-కడెం

రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం మొదలైంది. పోటీపడి హామీలు ప్రకటిస్తున్నటువంటి రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు కార్మికుల సమస్యలను తమ మేనిఫెస్టోలో చేర్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో సీపీఐ(ఎం) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులు, ఉద్యోగాలు వస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే సకల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కాని 10 సంవత్సరాల కాలంలో ఎలాంటి ఉద్యోగాలు కల్పించకపోగా, కాంగ్రెస్ హామీలకు తలదన్నే విధంగా అర్రాస్ పాట పాడినట్టు, మరిన్ని హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయనటువంటి కేసీఆర్ చిన్న పిల్లాడి లాగా మాట్లాడుతున్నారని తెలిపారు. దేశంలో బీజేపీ మతోన్మాద ఏజెండాతో ముందుకు పోతుందని తెలియజేశారు. మణిపూర్ లాంటి ఘటనలను సృష్టిస్తుంటే మరోకసారి అధికారం ఇవ్వాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజల ముందుకు వస్తున్నాయని అన్నారు. ఈ పార్టీలను ఓడించాలని వీరికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డాకూర్ తిరుపతి, ఖానాపూర్ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, కడెం మండల నాయకులు కుమ్మరి రమేష్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్, బస్ డిపో బోయివాడ కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ ఆరు వారాల్లో అధికారంలోకి వస్తుందని, సోనియా గాంధీ ప్రకటించిన హామీలను అమలు చేస్తామని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ ఎన్ని హామీలు ఇచ్చిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు...

కాంగ్రెస్ పార్టీలో చేరికలతో అధికార బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఈ ఎన్నికల్లో డిపాజిట్‌లో గల్లంతయ్యేలా కనిపిస్తున్నాయని అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున హస్తం పార్టీలోకి వలసలందుకున్నాయన్నారు. మామడ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సామ వికాస్‌రెడ్డి, నాయకులు సాయికృష్ణ, సాయినాథ్, సోన్ మండలంలోని న్యూ బొప్పారం గ్రామ మాజీ సర్పంచ్ ఎండీ మౌలానా కాంగ్రెస్‌లో చేరారు.

పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని వంటావార్పు

- పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన సర్పంచ్, ఎంపీటీసీ
- 18వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. కాగా ఈ దీక్షలో మహిళా సంఘాలు, మహిళల పాల్గొన్నారు. పల్సి గ్రామాన్ని తక్షణమే మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామసర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు, రాజకీయ నాయకులు తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. గ్రామ మహిళలు, ప్రజలు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. భోజనాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ. 2016 గతంలో కుభీర్ మండల సర్వసభ్య సమావేశంలో పల్సి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కుభీర్ మండలానికి ప్రజలు రావాలంటే దూర భారం అవుతుందన్న ఉద్దేశంతో, అన్ని వసతులు ఉండి చుట్టుపక్కల అన్ని గ్రామాలకు దగ్గరలో, అనుకూలంగా ఉన్న గ్రామమైనటువంటి పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. మొన్న బీజేపీకి 40 మంది రాజీనామా చేయగా, ఈరోజు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు, వివిధ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైతే తమకు మద్దతు ఇచ్చి, మండలంగా ప్రకటిస్తామని రాతపూర్వకంగా రాసిస్తారో ఆ అభ్యర్థికి ప్రచారం చేసుకోవడానికి అవకాశం ఇస్తామన్నారు. లేదంటే అసెంబ్లీ స్థానిక ఎన్నికలకు బహిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువకులు, రాజకీయ నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ

దండారి.. ఉత్సవాలకు వేళాయే..

- ఆదివాసీ, గోండుల పవిత్ర పండగ
- సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబం
- ప్రారంభం కానున్న దండారి సంబరాలు
- ఏర్పాట్లలో గిరిజనులు

నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీల పెద్ద పండగ దండారి ఉత్సవాలు.. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక దండారి ఉత్సవాలు. వారి ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. గోండు గూడాల్లో గిరిజనుల జీవనశైలిని ప్రతిబింబించే దండారి గుస్సాడి ఉత్సవాలు నేడు ప్రారంభంకానున్నాయి. విచిత్ర వేశాధారణతో అంతే అద్భుతమైన పద్ధతులతో వారు చేసే పూజలు, ఏర్పాట్లు వారి సంప్రదాయాలను పరిచయం చేస్తాయి. దీపావళికి పక్షం రోజుల ముందు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక దండారి మొదలవుతోంది.

బలిదానంతో దండారి ప్రారంభం

ఆదివాసీలు గ్రామ కూడలిలో నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలాలు, మంత్రదండం లాంటి రోకలి తదితర సంప్రదాయ వస్తువులను గ్రామ పటేల్ ఇంటి ముందు ఉంచి వాటికి బలిదానం చేసి ప్రత్యేక పూజలతో బోగి పండగ చేసి ఉత్సవాలు ఆరంభిస్తారు. గిరిజన గోండు గూడాల్లో గ్రామ పటేల్‌ది ప్రత్యేకమైన స్థానం. ఆయన ఊరి పెద్దగా వ్యవహరిస్తూ ఉంటారు. గిరిజనులకు పటేల్ మాట వేదవాక్కు. అందుకే దండారి ఉత్సవాలు గ్రామ పటేల్ ఇంటి ముందే నిర్వహించడం ఆనవాయితీ.

ప్రత్యేక వేషధారణలు..

దండారి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది



రోజుల పాటు గుస్సాడి వేషాధారణ వేసిన వారు దండారి ముగింపు వరకు స్నానం చేయరు. ఒంటికి బూడిద పూసుకొని దాన్నే స్నానంగా భావించడం వీరి ఆచారం. దీనితో పాటు ముఖానికి మసి, ఎడమ భుజంపై జింక తోలు, మెడలో రుద్రాక్షలు, కుడి చేతిలో మంత్రదండం(రోకలి), జంతువుల కొమ్ములు, నెమలి ఈకలతో చేసిన టోపీలు, కాళ్లకు గజ్జలు, నడుముకు వారి వస్తువుల సంచితో, విచిత్ర వేశధారణతో సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తారు.

ఇతర గ్రామాల గుస్సాడీలకు ఆథిత్యం..

గుస్సాడి వేశధారణ వేసినవారు ఒక సంవత్సరం తమ సొంత గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి అక్కడి గిరిజనుల ఆథిత్య విందులో పాల్గొని ఆటపాటలతో, నత్యాలతో కనువిందు చేయడం ఆనవాయితీ. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లిన గుస్సాడీలకు ఘన స్వాగతం పలుకుతారు. మొదట అథిత్యం పుచ్చుకున్న వీరు తర్వాతి సంవత్సరం తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. ఇలా ఆ గ్రామాల మధ్య బంధుత్వం పెరుగుతుంది.

గుస్సాడీ వేషాలు.. థింసా నృత్యాలు

గిరిజనులు గుస్సాడీ వేషాన్ని ధరించేందుకు ఆసక్తి చూపుతారు. గుస్సాడీ వేషాధారణ వేసిన వారికి వారి దేవతలు ఆవహిస్తారని చెబుతారు. అతని చేతికి ఉన్న మంత్రదండం శరీరాన్ని తాకితే ఎలాంటి రోగాలైన నయమవుతాయని వారి నమ్మకం. డప్పులు, భాజాలతో చప్పుళ్లకు అనుగుణంగా గజ్జెల అడుగులతో లయబద్ధంగా నాట్యం చేస్తూ గుస్సాడీ నృత్యాలు ప్రదర్శిస్తారు. గోండు గిరిజన మహిళలు కూడా పురుషులతో సమానంగా థింసా నృత్యాలు చేస్తారు.

నువ్వుల నూనెతో పూజలు..

గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటిలో దీపావళి పండగ సందర్భంగా గిరిజన మహిళలు పవిత్రంగా ఉపావాస దీక్ష చేస్తూ నువ్వులను రోటిలో దంచి నూనెను తీస్తారు. ఆ నూనెతో దండారి ముగింపు వరకు దీపాలను వెలిగించి పూజలు చేస్తారు.



నెమలి టోపీల తయారీకి కేరాఫ్ పాటగూడ..

నెమలి పింఛం టోపీల తయారీలో కెరమెరి మండలంలోని పాటగూడ గ్రామం ప్రసిద్ధి గాంచింది. గడిచిన పాతికేళ్ల నుంచి ఈ గ్రామస్తులు నెమలి టోపీలను తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యు), కెరమెరి, తిర్యాణీ, వాంకిడి తదితర మండలాలకు చెందిన వారు ఇక్కడి నుంచి నెమలి పింఛం టోపీలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఒక్క టోపీ ఖరీదు రూ. 10 వేలు పలుకుతున్నా.. వీరు కేవలం రూ. 3 వేలు కూలీ కింద తీసుకుంటున్నారు.

కొలబోడితో దండారి ముగింపు..

దీపావళి పండగ మరుసటి రోజు కొలబోడి ఉత్సవాలను దండారి సంబరాలు ముగిస్తారు. దీపావళి అనంతరం గుస్సాడీలు చివరి రోజున ఆనందంగా నృత్యాలు చేస్తారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో ఉన్న ఇప్ప చెట్టు వద్ద తమ ఇలవేల్పు అయిన భీందేవుని సన్నిధికి చేరుకుంటారు. అక్కడ కొలబోడి సందర్భంగా నెమలి టోపీలను తొలగిస్తారు. గుస్సాడీ వేశధారణ, అలంకారణ వస్తువులను భీందేవుని సన్నిధిలో పెట్టి కోళ్లు, మేకలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



పవిత్రమైన పండగ

పెందూర్ మోతీరాం ఎంపీపీ కెరమెరి



మా ఆదివాసీ గోండు గిరిజనులకు దీపావళి పండగా పవిత్రమైన పండగ. అత్యంత పవిత్రంగా గిరిజన దేవతలను, వన దేవతలను పూజిస్తాము. ఈ పండగకు బంధువుల ఇళ్లకు వెళ్తాం. గ్రామంలో ప్రతి రోజు రాత్రి గుస్సాడీలు థింసా నృత్యాలు, రేలారేరేలా ఆడపడుచుల నృత్యాలు ఆకట్టుకుంటాయి.

భక్తి శ్రద్ధలతో గుస్సాడీ వేషధారణ

సేడ్మకి తుకారం సకడా గ్రామస్తుడు



గుస్సాడీ వేడుకలను కఠోర నియంవమాలతో జరువుకుంటాం. గుస్సాడీ వేషధారణ ధరించిన వ్యక్తులు కోరుకున్న కోరికలు నెరవేరాలని, గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను పాటిస్తూ గుస్సాడీ వేడుకలను గిరిజన గుండెల్లో ఘనంగా జరుపుకుంటాం

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) పట్టణ గుడిసె వాసుల పోరాట కమిటీ డిమాండ్

నవతెలంగాణ-చెన్నూర్

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి. ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఆదివారం పట్టణంలోని గుడిసె వాసుల ఇండ్ల స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఆరు నెలలుగా పేదలు ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల పోరాటం చేస్తున్నారని అన్నారు. కిరాయిలు కట్టుకోలేని స్థితిలో ఉన్న నిరుపేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకోని జీవిస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టణం, మండలంలో గాని, ఇతర మండలాల్లో కానీ పేదలకు ఇంటి స్థలం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిన ధాఖలాలు లేవని గుర్తు చేశారు. ప్రభుత్వ భూములన్నీ అన్యాక్రాంతం అవుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని అన్నారు. కనీసం పేదలు వేసుకున్న గుడిసెలకు రక్షణ కలించడం లేదని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా భూకబ్జాదారులు, కిరాయి రౌడీలను తీసుకువచ్చి గుడిసెలపై పెట్రోల్ పోసి దహనం చేసినా వారిపై అధికారులు కేసులు కూడా నమోదు చేయలేకపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైన ఈ పేదల భాదలు చూసి వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. వెంటనే భూకబ్జాదారులపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడేంకి చందు, ఎండీ అవేజ్, ఐద్వా అధ్యక్షులు పోచక్క, కార్యదర్శి నాగజ్యోతి, నాయకులు రుక్సాన, పద్మ, మధు, మారయ్య, సమ్మయ్య, రామయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఆదరించండి అభివృద్ధి చేస్తా

- బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వినోద్

నవతెలంగాణ-కాసిపేట

ఆదరించి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఆదివారం ముత్యంపల్లిలో పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన గెలుపుకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కారకురి రామచందర్, మాజీ మండల అధ్యక్షుడు తిరుపతి, రాజమౌళి, ఎల్పుల వెంకటేష్, నలిగేటి శంకర్, పుర్ర పోశం, రేచవేణి స్వామీ, మారం రంజిత్, మారం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మేరు సంఘ అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మేరు సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం అడహక్ ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎన్నావార్ రాజు సూచించారు. ఆదివారం పట్టణంలోని శ్రీవిఠల్ రుక్మబాయి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నూతన అడహక్ కమిటీని ఎనున్నకున్నారు. అధ్యక్షుడిగా పొలిపెల్లి నాందేవ్, ప్రధాన కార్యదర్శిగా కర్నెవార్ రాకేష్, కోశాధికారి పొల్లిపెల్లి గజానాన్‌లతో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. త్వరలో జిల్లా కమిటీ ఎన్నిక సందర్భంగా పట్టణ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో సంఘ సభ్యుల వివరాలు, స్థితిగతులను తెలుసుకుంటారని కన్వీనర్ ఎన్నావార్ రాజు తెలిపారు. కులస్థులను ఐక్యం చేసి హక్కులు, సంఘ భవనం, ఇళ్ల సాధనకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని నీరాల గ్రామానికి చెందిన పంద్రే సుభాష్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో చికిత్స కోసం దాతల సహకారం కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న పర్ధాన్ సంఘం ఆదివాసి నాయకులు చికిత్సకు రూ. 12వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాదితుడికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం అధ్యక్షులు గంగాప్రసాద్, గేడాం సునీల్, సిడాం రాకేష్, అభిమాన్, గణేష్, శత్రుఘన్ పాల్గొన్నారు.

పత్తి పంట క్షేత్ర ప్రదర్శన

నవతెలంగాణ-తాంసి

మండలంలోని కొట్రంగి గోవింద్ పత్తి పంటను కావ్వే సీడ్స్ కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. ఆదివారం రైతు వేసిన పంటను రైతులకు చూపించి సితారకు సంబంధించిన బీటీ 2 రకం పత్తి ఎదుగుదలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతును కంపెనీ ప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, డీలర్ శ్రీకాంత్, రైతులు మహేందర్ రెడ్డి, రాంరెడ్డి, ప్రభాకర్, భూమన్న, రాములు పాల్గొన్నారు.

ప్లాటినం సీడ్స్‌తోనే అధిక దిగుబడి

నవతెలంగాణ-ఇచ్చోడ

వేద సీడ్స్ ప్లాటినం బిజీ2 రకంతో అధిక దిగుబడి వస్తోందని కంపెనీ ఏజీఎం నరేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని గెర్జం గ్రామ శివారులోని బచ్చువారు సంతోష్ చేనులో పత్తి పంట క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. సీడ్స్ రకం, సస్య రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం మహేష్, సేల్స్ మేనేజర్ అల్లంకొండ పోతన్న, పీజీఓ రమేష్ రైతులు పాల్గొన్నారు.

ముక్తాసాల్వే సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-నార్నూర్

ముక్తాసాల్వే సేవలు చిరస్మరణీయమని నాన్ ట్రైబల్ జిల్లా నాయకులు భారత్ వాగ్మారే అన్నారు. దివారం తాడిహత్నూర్ గ్రామంలో వీరనారి ముక్తాసాల్వే 183వ జయంతిని నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యను అభ్యసించి ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అన్నాభావు సాఠే జిల్లా నాయకులు ఉద్ధవ్ కాంబ్లే, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు శేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు, గ్రామ పెద్దలు సూరజ్ జాదవ్, విద్యారాణి, సూర్య వంశీ పండరి, దత్తరాజ్, భానుదాస్, ముక్తాసాల్వే కమిటీ గ్రామ అధ్యక్షుడు గోపాల్ ఇరాళ్లే పాల్గొన్నారు.

పత్తి పంటకు పందుల బెడద నష్టపోతున్న రైతులు

- సెన్సార్ విద్యుత్ తీగాలు పెట్టాలంటున్న రైతులు



పత్తిపంటను నాశనం చేసిన అడవి పందులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆరు గాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



రాలిన పత్తికాయలు

చేతికి వచ్చే పంటకు తెగుళ్లతో పాటు అడవి పందుల బెడదతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ సారి పత్తి పంట అధికంగా సాగు చేస్తున్నారు. 2023-24 ఖరీఫ్‌లో 25,450 ఏకారాల్లో పత్తి సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ గణంకాలు చెబుతున్నాయి. పంట సాగు పెరగడానికి ప్రధాన కారణం గత సంవత్సరం ప్రయివేట్‌లో పత్తి ధర ఎక్కువగా ఉండడమే. సాగు వరకు అంత బాగున్పటికి దాన్ని కాపాడుకోవాడానికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. వాతావరణం అనుకూలించకపోవడం, సరైన సమయంలో వర్షాలు రాక కాత, పూత, పిందెలతో పచ్చగా ఉన్న పంట ఎండు బారిపోతోంది. దీన్ని నుంచి కొలుకుందామని అనుకుంటున్న సమయంలో అడవి పందులు కాయలను తింటూ పంటను నష్టపరుస్తున్నాయి. పందుల నుంచి రక్షించేందుకు ప్రాణహని కలగని సెన్సార్ విద్యుత్ తీగలను అమరుస్తున్నారు. ఖర్చు ఎక్కువ అవడంతో చిన్న, సన్నకారు రైతులు అమర్చుకోలేక పోతున్నారు. రక్షణ కోసం రాత్రంతా కాపలా కాస్తున్నారు. అడవి పందుల నుంచి పంటలకు రక్షించేందుకు అటవీ శాఖ ద్వారా పంట నష్ట పరిహారంతో పాటు విద్యుత్ సెన్సార్ తీగలను ఉచితంగా అందజేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సెన్సార్ తీగలను అందజేయాలి

చౌహన్ ఉమాజీ నాయక్, రైతు హర్కపూర్‌తాండ.



పత్తి పంటతో పాటు రబీలో మక్క(మొక్క జొన్న) పంటను సాగు చేస్తున్నాను. అడవి పందులు ప్రతి ఏటా పంటను నాశనం చేస్తున్నాయి.

పంటను కాపాడేందుకు రాత్రి కాపలాకు వెళ్లాల్సి వస్తుంది. పందుల దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డాను. పంటను రక్షించుకునేలా ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా విద్యుత్ సెన్సార్ తీగలను ఉచితంగా పంపిణీ చేయాలి.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జోగు రామన్న



బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి బలం కార్యకర్తలేనని వారి కృషి మరువలేనిదని కొనియాడారు. డైట్ మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో హరీశ్‌రావు రాకతో ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. ప్రజాశీర్వాద సభ సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ కనీవినీ ఎరుగని రీతిలో సాగిందని పేర్కొన్నారు. సభలో తాము ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో పెద్దఎత్తున కార్యకర్తలు హాజరయ్యారని వాపోయారు. సభ విజయవంతం కావడానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి హరీశ్‌రావు పాల్గొన్న సభలో సైతం మైదానం పూర్తిగా గులాబీమయం అయిందన్నారు.

ఇటీవల జరిగిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభకు ఉమ్మడి జిల్లా నుండే కాక నిజామాబాద్, మహారాష్ట్ర లాంటి ప్రాంతాల నుంచి జనాలను తరలించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులు లేరని హరీశ్‌రావు పాల్గొన్న సభ చాటి చెప్పిందన్నారు. సోమవారం జైనథ్‌లోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం మండలంలో ప్రచారాన్ని విస్తృతం చేస్తామని తెలిపారు. సభను రెట్టింపు ఉత్సాహంతో విజయం చేసిన పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు సాజీదోద్దీన్, అధికార ప్రతినిధి గంగారెడ్డి, సాయిని రవికుమార్, దాసరి రమేష్ పాల్గొన్నారు.



ప్రచారాన్ని ప్రారంభించిన బోథ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్

కాంగ్రెస్ అభ్యర్థి అశోక్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-తాంసి

బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వన్నెల అశోక్‌కు ఆదివారం తాంసి, తలమాడుగు, భీంపూర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మోటర్ సైకిల్ ర్యాలీతో మండల కేంద్రానికి చేరుకున్నారు. మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని కాపాడుకుంటానని తెలిపారు. అధిష్టానం తన సేవలకు గాను అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. 30 రోజులు కష్టపడితే అధికారం సాధించవచ్చని ఆ దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, కన్వీనర్లు సంతోష్, అశోక్, నాయకులు నారాయణ, వినోద్ రెడ్డి, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

c
m
y
k

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం అక్టోబర్, 30 2023

బీఆర్ఎస్‌ను ఆదరించండి

• జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు

నవతెలంగాణ-దహెగాం

బీఆర్ఎస్ పార్టీని ప్రతి ఒక్కరు ఆదరించాలని జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రానున్న రోజుల్లో మరింత మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరెన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యేగా కోనేరు కోనప్పను గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు ప్రసాద్‌రాజు, అల్లం మల్లేష్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు శాంతియుత మార్గంలో నడవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో గత మూడు నెలల నుండి నిర్వహిస్తున్న గ్రంథపఠనం ఆదివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపీపీ ముండె విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుండి గ్రంథపఠనం(వర్షావాస్) నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, గ్రంథపఠనం నుండి పలు అంశాలు నేర్చుకొని ప్రతి ఒక్కరు శాంతియుత మార్గంలో నడవాలన్నారు. గ్రంథపఠనం చేసిన ఉప్రె రాజేశ్వర్, విద్యాసాగర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు ఉప్రె జయరాం, విలాస్, పాండు, విజయ్, దుర్గం శ్రీనివాస్, సునీల్, రోశన్, విఠల్, రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు గంగుబాయి, మహిళలు పాల్గొన్నారు.

తుమ్మిహెట్టిలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ- కౌటాల

తుమ్మిహట్టి గ్రామంలో వైద్యాధికారిని నవత ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ఎక్కువ ఉన్నట్లు తెలిసిన వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి, అవసరమున్న వారికి మందులను అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో నాటు వైద్యం, ఇతరులు ఇచ్చే మందులను వాడకూడదని ఆమె తెలిపారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది శైలేందర్, సునీత, తదితరులున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ- కౌటాల

మండల కేంద్రానికి చెందిన పోస్ట్ మాస్టర్ దుర్గం పితాజి, తాళ్లపెల్లి సాయి గౌడ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతు మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతుల కుటుంబాలను పరామర్శించి, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం దాసరి హరిదాస్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ- కౌటాల

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల్లో నుంచి వీర్దండి, తలోడి, గురుడుపేట్, దన్నూర్‌హెటీ గ్రామాల నుంచి యువకులు బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు.

బుద్ధుని బోధనలు శాంతి విస్తరణకు తోడ్పడుతాయి

• బుద్ధిస్ట్ ఇంటర్నేషనల్ నెట్ వర్క్ అధ్యక్షుడు చెన్నయ్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బుద్ధుని బోధనలు శాంతి విస్తరణకు తోడ్పడుతాయని బుద్ధిస్ట్ ఇంటర్నేషనల్ నెట్ వర్క్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో 68వ ధమ్మచక్ర పరివర్తన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుని బోధనలు సకల మానవాళి జీవితాల్లో శాంతిని అందిస్తుందని, ప్రపంచమంతా బుద్ధుని బోధనలు అవలంబించాలన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ కృషి వల్లనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశాలు దక్కి గొప్ప స్థాయిల్లో ఉన్నారన్నారు. అంబేద్కర్ త్యాగాలతో ఉద్యోగాలు పొందిన ప్రతీ ఒక్కరు సమాజం కోసం ఆలోచించాలన్నారు. గౌతమ బుద్ధుని బోధనలు సమాజ హితం, శాస్త్రీయ దృక్పథంతో ఉంటాయని ప్రతీ ఒక్కరు పాటించాలని కోరారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బౌద్ధ కవి మధు భావర్కర్, అంబేద్కర్ సెంటర్ కమిటీ అధ్యక్షులు జాడి బాపు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు ముంజం మనోహర్, ప్రధాన కార్యదర్శి దీపక్, సెంటర్ కమిటీ కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షురాలు లీలారాణి, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, లుంబిని దీక్ష భూమి మాజీ అధ్యక్షుడు తిరుపతి, అంబేద్కర్ సంఘం నాయకులు పెరుగు ఆత్మ రావ్, శ్యామ్ రావ్, పుల్లయ్య కాంబ్లే, తుకారాం చునర్కార్, బాబురావు, వినేశ్, సంతోష్ ఝాడే, చైతన్య, హేమంత్ షిండే, బంటి, రాజేశ్వర్, మారుతి దుర్గే పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



నవతెలంగాణ- కౌటాల

మండలంలోని తాటినగర్, బాలేపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ కౌటాల మండల అధ్యక్షులు ఆడే వసంత్‌రావు స్థానిక సర్పంచ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. వసంత్‌రావు మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో మళ్ళీ గెలిచేది ప్రస్తుత ఎమ్మెల్యే కోనేరు కోనప్పనేనని తెలిపారు. నియోజకవర్గం ఇంకా అభివృద్ధి చెందాలంటే కోనప్ప సాధ్యమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి కోనప్ప గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతిపక్షాల మాయమాటలు పట్టించుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాటినగర్, బాలేపల్లి గ్రామ సర్పంచులు రత్నం సోమయ్య, జాడే కుశబ్‌రావు, ముత్తంపేట్ ఎంపిటిసి సురేఖ రవి, నాయకులు ఆడే నారాయణ, రాచకొండ అశోక్, కొట్రంగి మోతీరాం, డోంగ్రీ శంకర్, దుర్గం దాస్, ఛత్రపతి కొబ్రాగాడే, లక్ష్మణ్ గొంగ్లే పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సమావేశానికి జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరై శ్రేణులకు రానున్న ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని ప్రతి ఒక్కరికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇర్ఫాన్, వసీం, భరద్వాజ, సాయి పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అనివార్య కారణాల వల్ల నేడు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి ప్రజావాణి గురించి తెలియజేస్తామని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలియజేశారు.

గనులపై ఎన్నికల ప్రచారం నిషేధం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి గనులపై రాజకీయ పార్టీలు, వాటికి అనుకూలంగా ఉన్న ట్రేడ్ యూనియన్‌లు నాయకుల ప్రచారాలను నిషేధిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ జీఎం పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్టుమెంట్లపై ఎలాంటి రాజకీయ ప్రచారాలు చేయడానికి వీలులేదన్నారు. ఉద్యోగులు నిబంధనలు ఉల్లంఘిస్తే కంపెనీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు.

c m y k

దండారి నిర్వహణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట

దండారి నిర్వహణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండలంలోని దేవాపూర్ సల్పలవాగు వేంకటాద్రి గుడి ఆదివాసీ సంఘాలు సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా దండారి దర్బార్ నిర్వహణ కమిటీ ఎన్నుకొని ప్రకటించారు. కమిటీ అధ్యక్షులుగా ఆడే జంగు, ప్రధాన కార్యదర్శిగా మడావి అనంతరావు, కోశాధికారిగా రాయి సిడాం రమేష్, ఉపాధ్యక్షులుగా కనక రాజు, పెంద్రం ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. సంస్కృతిని చాటేలా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 8, 9 తేదీలలో దండారి ఉత్సవాలు సలపల వాగు, వేంకటాద్రి గుడి వద్ద నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మండలంలోని ఆదివాసీలందరు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత నిందితుల అరెస్టు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కన్నాల బస్తికి చెందిన దానం రవి వద్ద రూ. 4860 విలువ కలిగిన అక్రమమద్యాన్ని పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ బన్సీలాల్ తెలిపారు. నిందితుడు నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నందు బెల్ట్ షాప్ నడుపుతూ మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపారు బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం...

కన్నాల బస్తికి చెందిన రాపెల్లి శారదావద్దనుండి-18 అక్రమ మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్సై బన్సీలాల్ తెలిపారు. రూ.2340 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మహిళపై బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో 30 సంవత్సరాల చరిత్రను తిరగరాస్తా..

- ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గంలో గత 30 సంవత్సరాల చరిత్రను తిరగరాస్తానని ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బోజ్జు అన్నారు. ఆదివారం ఇందన్‌పల్లి నుంచి జన్నారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మొదటిసారిగా వచ్చిన ఆయనకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీగా కార్యకర్తలు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీ గానే ఉందని, అయినా కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. ఈసారి తనను గెలిపిస్తే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ దళిత గిరిజన, అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌తో ఇక్కడి ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో తనకు తెలుసునని అన్నారు. పార్టీకి సేవ చేస్తున్న ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు నిరుత్సాహపడకుండా పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు, ఏనుగు సుభాష్‌రెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, పసిఉల్లా మత్స్య శంకరయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయిల్‌షా, రాజశేఖర్, ఇసాక్, అల్లం వెంకట రాజం, నందు నాయక్, శిరీష్, సుధాకర్ నాయక్, సునారికారి లక్ష్మణ్, దాముఖ కరుణాకర్, ముజ్జు గంగన్న, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక..

ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి లోతొర్రె గ్రామ సర్పంచ్ ఆత్రం నర్సింగరావు, జన్నారం మండల ఆదివాసీ సంఘం నాయకులు పెంద్రం రాజేష్, మెస్రం సుదర్శన్, కుంట ఎల్లయ్య, బొంతల కైలాస్, పల్లపు శంకర్, కుడ్మేత మధు, తిమ్మాపూర్ గ్రామం నుంచి పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణలో ఈ సారి కాంగ్రెస్ అధికారంలోకి ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల అధ్యక్షుడు ఈసా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరాగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటి కార్డులే గెలిపిస్తాయని, కార్యకర్తలు వీటిని ప్రజలకు తెలియజేయాలని వెంకటస్వామి అన్నారు. సిరంగి శంకర్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దబోయిన శంకర్ మాసాడి తిరుపతి, దేవరకొండ రాజన్న, మనోహర్, రవీందర్‌లతో పాటు పలువురు చేరినట్లు ఆయన తెలిపారు.

జిల్లా సరిహద్దులో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇందనపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆదివారం సాయంత్రం ఎస్సై సతీష్ సీఆర్‌పీఎఫ్ బలగాలతో వాహనాలను తనిఖీ చేస్తు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అమ్మ ఒడి ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-తాండూర్

అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం గత మూడు సంవత్సరాలుగా అమ్మ ఒడి ఎన్జీవో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. నిరంతర ప్రక్రియలో భాగంగా బెల్లంపల్లిలో 219వ వారాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు సురేందర్ సింగ్, గొర్ల శ్రీనివాస్, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల మధు, సువర్ణ, రంగ సురేష్,తాండూరి అనిరుధ్ యూసుఫ్,చెందుపట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు మల్లేష్‌ను మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో ఆర్డినేటర్స్ నియోజకవర్గాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నాయకులు రాష్ట్ర అధ్యక్షున్ని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షులు సాయి, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి జగన్, నియోజకవర్గ నాయకులు మహమ్మద్, సాజిద్, చోటు, నక్క తిరుపతి, సాజిద్, సాయి కిరణ్, చిట్టి బాద్షా అంజత్ ఖాన్, శ్రావణ్, సంజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు

అల్పాహారం పంపిణీ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ చౌరస్తాలో300 మందికి ఆదివారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు రత్నం రాజన్న, రామన్న, కంటెవాడ నాగేష్, గెల్లీ జయరాం యాదవ్, వెంకట్‌రాజం, శంకర్‌గౌడ్, కనకయ్య గౌడ్, గంట శ్రీనివాస్, అనిల్, వెంకటస్వామి, రాజకుమార్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవకు యువత ముందుండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

యువత ప్రభుత్వ కొలువులతో పాటు దేశ రక్షణలో ముందుండాలని పిప్పల్‌ధరి మండల సాధన కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలంగ్ బాపురావు, తాక్‌సాండే నిలకంఠ్ ఆకాంక్షించారు. అగ్నిపథ్‌లో గ్రామానికి చెందిన చింతల సంతోష్ కుమారుడు చింతల నవీన్ అగ్నిపథ్ శిక్షణ పూర్తి చేసుకోని తిరిగి వచ్చుఇన ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల సాధన కమిటీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు సత్కారించారు. దేశ సేవలో గ్రామ యువకుడి అవకాశం రావడం గర్వకారణమని సాధన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలంగ్‌రావ్, తాక్‌సాండే నిలకంఠ్ అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునేశ్వర్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులు బాబారావ్ తాక్‌సాండే, టంకే నాగోరావ్, తాక్సండే గౌతం, టంకే హిరాలాల్, ముక్‌నాయక్ యువజన సంఘం అధ్యక్షులు తెలంగ్ విజయ్‌కుమార్, యువకులు గెడాం గణేష్, గ్రామస్తులు మినుకు మోహన్ పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటన ట్రైలర్ మాత్రమే



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్ర మంత్రి హరీష్ రావు ఆదిలాబాద్ పర్యటన ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా సీఎం కెసిఆర్ సభ సమయంలో చూపిస్తామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం న్యూ హౌసింగ్ బోర్డ్ జోన్ వన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తు కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. పట్టణంలో హరీష్ రావు పర్యటన సందర్భంగా చేపట్టిన బైక్ ర్యాలీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపిందన్నారు. తెలంగాణ ఏర్పడిన పదేండ్ల కాలంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యే జోగురామన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలరులు పవన్ నాయక్, ఆవుల వెంకన్న, కలీం, ఇబ్బు, శరత్, కలీం, గణేష్, చందర్, శ్రీకాంత్, మున్నీ, షీల, లక్ష్మి ఉన్నారు.

ధర్మసమాజ్ పార్టీ గడపగడప ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని యాపల్‌గూడలో ఆదివారం ధర్మ సమాజ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతు బీఎస్పీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పార్టీని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అసెంబ్లీకి పంపాలని కోరారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చక్రవర్తి మహారాజ్, మహిళాలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు అల్పాహారం బడ్జెట్ కేటాయించాలి

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించనున్న అల్పాహారం కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులకు అవసరమైన బడ్జెట్ వెంటనే కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అల్పాహారం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించకుండా పథకం ప్రవేశపెట్టడం దానికోసం జీఓ జారీ చేయడం కార్మికులతో వెట్టిచాకిరి చేయించడమేనన్నారు. అల్పాహారం ప్రతి విద్యార్థికి రూ.25 కేటాయిస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ఇన్‌ఛార్జి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ ఒక విద్యార్థికి రూ.10.50 చెల్లించి పూరీలు ఇడ్లీలు పెట్టాలని అది ఉదయం 8 గంటల లోపు చేయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇస్తున్న 2000 కాకుండా అల్పాహారానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు అల్పాహారంతో పనిభారం పెరుగుతుందన్నారు. దాన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం వారికి చెల్లించే పారితోషికాన్ని పెంచడంతోపాటు నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె శారద, మాయ మాట్లాడుతూ వంట సామాగ్రి గ్యాస్ తదితర సామాగ్రి కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని కోరారు. కోడిగుడ్డు వారానికి మూడుసార్లు పెడుతున్నామని, గుడ్డుకు ఐదు రూపాయలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని, మార్కెట్లో గుడ్డు రేటు 6 రూపాయల అంటే ఎక్కువగా ఉందని అలాగే ఉడకపెట్టి పెడుతున్నామని ఒక్కొక్క కోడిగుడ్డుకు 8 రూపాయల చెల్లించాలని కోరారు.

ఎమ్మెల్యే రామన్నకు వివిధ సంఘాల మద్దతు

నవ తెలంగాణ -ఆదిలాబాద్ అర్బన్



ఎమ్మెల్యే జోగు రామన్నకు వివిధ సంఘాల మద్దతు లభిస్తోంది. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో బొందిలి రాజ్‌పుత్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన దసరా మిలన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొనగా తమ సంఘం పూర్తి మద్దతు ఎమ్మెల్యే ఆయనకు ఉంటుందని సంఘం నాయకులు తెలిపారు. ముందుగా మహారాణా ప్రతాప్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రాణాప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘ సభ్యులకు ఐడీ కార్డులను అందించారు. ఇదిలా ఉంటే చిల్కూరి లక్ష్మీనగర్ కాలనీలో సంత్‌రవిదాస్ సేవ సమాజ్ సభ్యులు సైతం ఎమ్మెల్యేకు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సమాజ్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు స్వదీప్ సింగ్ ఠాకూర్ కార్యదర్శి సతీష్, విజయ్ సింగ్, సంత్ రవిదాస్ సేవా సమాజ్ అధ్యక్షులు రఘునాథ్, ప్రధాన కార్యదర్శి దాదారావు,రఘ నాథ్ ఎక్కర్, రాంజీ పుల్కార్, రాజు, కదం సంధిప్, జెంజర్ధన్ ,ఉపాధ్యక్షులు రాంజీ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

నవతెలంగాణ-కౌటాల

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేల పోలీసులు సంసిద్ధంగా ఉన్నామని ఎస్సై మధుకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల నేపథ్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట్, వైగాం, గుడ్లభోరీ, విజయనగరం గ్రామాల్లో సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ సాగించారు. ఈ సందర్భంగా ఎస్సై మధూకర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ప్రజలకు సహకరించాలని కోరారు. అనవసరంగా గొడవలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపేద కుటుంబానికి సాయం

నవతెలంగాణా-తాంసి

మాల సంక్షేమ సంఘం తలమడుగు ఆధ్వర్యంలో ఆదివారం పొన్నారి గ్రామానికి చెందిన రాజనాల శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో సంఘం తరపున దాతలు ముందుకు వచ్చి రూ.5 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘ సభ్యులు గంగన్న, దేవన్న, రాజేశ్వర్, విష్ణువర్ధన్, రవి, అడెల్లు, చంటి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణానికి చెందిన ఫ్రూట్ యూనియన్, హ్యాకర్స్ నాయకులు బీఆర్ఎస్ చేరారు. ఆదివారం ఓల్డ్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖల్లో అండగా నిలుస్తూ అభివృద్ధికి పాటు పడుతున్నామని, అధికారం కోసం గోడవలు సృష్టించే పార్టీలకు కాకుండా అభివృద్ధికి కృషి చేస్తున్న తమ పార్టీకే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అలాల్ అజయ్, అశ్రఫ్, ఫ్రూట్ యూనియన్ అధ్యక్షులు అజీంఖాన్, నయీం, అన్వర్ చౌదరి, మొహిద్ ఖాన్, అలీం పాల్గొన్నారు.

c m y k